ఎన్నో తిరస్కారాల్ని ఎదుర్కొన్నా!

ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో అగ్ర కథానాయికగా చలామణి అవుతున్నది కన్నడ సోయగం రష్మిక మందన్న. తెలుగు, హిందీ భాషల్లో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అయితే తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని, కెరీర్ తొలినాళ్లలో అవకాశాలు అంత సులభంగా రాలేదని చెప్పింది రష్మిక. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలి నాటి కష్టాల గురించి చెప్పుకొచ్చింది భామ. ఆమె మాట్లాడుతూ 'ఆడిషన్స్‌కు వెళ్లిన ప్రతీసారి తిరస్కారాలు ఎదురయ్యేవి. కొందరైతే నేను నటిగా సక్సెస్ కావడం చాలా కష్టమని మాట్లాడేవారు. అవకాశాలు రావనే దిగులుతో కన్నీళ్లతో ఇంటికి వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఓ సినిమా సెలెక్ట్ చేసిన తర్వాత మూడు నెలల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్‌ను క్యాన్సిల్ చేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా.. ఎప్పుడూ సినీరంగం నుంచి తప్పుకోవాలనుకోలేదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, నటిగా ప్రతీ సినిమాకు ప్రతిభను మెరుగుపరచుకుంటూ ఈ స్థాయికి వచ్చా' అని చెప్పింది. ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో 'పుష్ప-2' తో పాటు మరో మూడు చిత్రాల్లో నటిస్తున్నది.

ఆయుధపూజలో దేవర

ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'పై నిర్మాణం నుంచే భారీ అంచనాలేర్పడ్డాయి. కొరటాల శివ దర్శకత్వంలో హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్నది. జాన్వీకపూర్ కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఎన్టీఆర్ పరిచయ గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. 'ఆయుధపూజ..' అనే పల్లవితో మొదలయ్యే ఈ గీతంలో ఎన్టీఆర్ నృత్యాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని, అభిమానులకు ఓ పండగలా ఈ గీతం ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరకర్త. విస్మరణకు గురైన తీరప్రాంతంలో తన వారిని రక్షించుకునే ధీరోదాత్తుడైన యువకుడిగా ఎన్టీఆర్ అత్యంత శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

మా కాంబోలో మరో హిట్ పక్కా

రవితేజ కథానాయకుడిగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'మిస్టర్ బచ్చన్' చిత్రం ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. సోమవారం సాయంత్రం కర్నూల్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ 'ఈ సినిమాలోని ప్రతి బ్లాక్ అందంగా ఉంటుంది. మిక్కీ జే మేయర్ నుంచి ఇలాంటి మ్యూజిక్ వస్తుందని ఊహించలేదు. సూపర్బ్ ఆల్బమ్ ఇచ్చాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వరుసగా సినిమాలు చేస్తూ విజయాలు సాధించాలని కోరుకుంటున్నా. హరీశ్‌శంకర్ సినిమా కోసం చాలా హార్డ్‌వర్క్ చేస్తాడు. ఈ సినిమాతో మా మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో విజయం పక్కా అని నమ్ముతున్నా' అన్నారు. దర్శకుడు హరీశ్‌శంకర్ మాట్లాడుతూ 'ఈ శుక్రవారం రెండు పెద్ద సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. రెండింటిని బ్లాక్‌బస్టర్ చేయాలని కోరుతున్నా. విశ్వప్రసాద్‌గారికి ఉన్న పాషన్ వల్లే ఈ సినిమాను ఫాస్ట్‌గా పూర్తిచేశాం. పీపుల్ మీడియాలో ఇక వరుసగా సినిమాలు చేస్తాను. ఈ సినిమా టైటిల్‌ను రవితేజ పెట్టారు. ఆయన కారణంగానే నేను జీవితంలో ఈ స్టేజీకి వచ్చాను. 'షాక్' చిత్రం ద్వారా నాకు సినీ జన్మనిచ్చి, 'మిరపకాయ్' ద్వారా పునర్జన్మనిచ్చారు. రవితేజ లేకుండా నా సినీ కెరీర్ లేదు. 'మిస్టర్ బచ్చన్'కు రిపీట్ ఆడియెన్స్ వస్తారనే నమ్మకం ఉంది' అన్నారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లున్నాయి. ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అన్నారు.

లయన్‌కింగ్‌కు షారుఖ్ డబ్బింగ్

వాల్ట్‌డిస్నీ రూపొందించిన 'ది లయన్ కింగ్' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఈ ఫ్రాంచైజీలో కొత్త సినిమాగా 'ముఫాసా: ది లయన్‌కింగ్' డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. పలు భారతీయ భాషల్లో కూడా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు బాలీవుడ్ అగ్ర హీరో షారుఖ్‌ఖాన్ వాయిస్‌ఓవర్ అందించారు. సినిమాలోని ప్రధాన పాత్ర ముఫాసాకి షారుఖ్ డబ్బింగ్ చెప్పడం విశేషం. ఆయన కుమారులు ఆర్యన్, అబ్రమ్‌లు కూడా ఈ సినిమాలోని సింబా, చిన్ననాటి ముఫాసా పాత్రలకు డబ్బింగ్ చెప్పారు. ఇటీవలే విడుదలైన హిందీ ట్రైలర్‌కు మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ చిత్రానికి బారీజెంకిన్స్ దర్శకత్వం వహించారు.

నాగార్జున 'మాస్' రీరిలీజ్

ప్రస్తుతం తెలుగు సినీరంగంలో రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్నది. అలనాడు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచిన చిత్రాలను మరలా ప్రేక్షకులకు ముందుకుతీసుకొస్తున్నారు. ఈ వరుసలో నాగార్జున నటించిన సూపర్‌హిట్ మూవీ 'మాస్' ఫోర్‌కే ఫార్మాట్‌లో ఆయన జన్మదినం సందర్భంగా ఈ నెల 29న రీరిలీజ్ కానుంది. 20 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం ఆ రోజుల్లో నాగార్జునకు అత్యధిక వసూళ్లు అందించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. రాఘవ లారెన్స్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మించారు. ఈ సినిమాలో జ్యోతిక, ఛార్మి, రఘువరన్, రాహుల్‌దేవ్ ప్రధాన పాత్రల్లో నటించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందించారు. ఫోర్‌కే ఫార్మాట్‌లో రీరిలీజ్ అవుతున్న ఈ చిత్రం నాగార్జున అభిమానులను అలరిస్తుందని చిత్ర బృందం పేర్కొంది.

కొత్త ప్రపంచాన్ని చూస్తారు

''తంగలాన్' థ్రిల్లింగ్ అడ్వెంచరస్ మూవీ. కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్ నేపథ్యంలో ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. తప్పకుండా థియేటర్స్‌లో చూసి ఈ అడ్వెంచరస్ జర్నీని ఆస్వాదించండి' అన్నారు హీరో విక్రమ్. ఆయన తాజా పీరియాడిక్ చిత్రం 'తంగలాన్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. పా.రంజిత్ దర్శకుడు. తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ విడుదల చేస్తున్నది. సోమవారం విజయవాడలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ 'నా 'అపరిచితుడు' మూవీ దేశంలోనే అత్యధిక రోజులు విజయవాడలో ఆడింది. తెలుగు ప్రేక్షకులు నాపై ఎంతో అభిమానం కనబరుస్తారు. 'తంగలాన్' సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది' అన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన ఆరతి పాత్ర కెరీర్‌లో బెస్ట్‌రోల్ అని కథానాయిక మాళవిక మోహనన్ తెలిపింది. సినిమాలో విక్రమ్ మేకోవర్, పాత్ర కోసం ఆయన పడిన కష్టం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తుందని నిర్మాత ధనుంజయన్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: స్టూడియోగ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్, నిర్మాత: కేఈ జ్ఞానవేల్‌రాజా, దర్శకత్వం: పా.రంజిత్.

ఆ సినిమాను స్ఫూర్తిగా తీసుకున్నా

విలక్షణ నటుడు విజయ్ సేతుపతి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. సినీరంగంలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా స్వశక్తితో పైకొచ్చారు. దక్షిణాది చిత్రాలతో పాటు బాలీవుడ్‌లో కూడా తనదైన ముద్రను వేస్తున్నారు. ఇటీవలే 'మహారాజ' చిత్రంతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారాయన. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మహేష్‌బాబు 'అతడు' సినిమా తనకెంతో స్ఫూర్తినిచ్చిందని, కష్టాల్లో ఉన్న ప్రతీసారి ఆ సినిమా చూసి ఉత్తేజం పొందుతానని చెప్పారు. 'కెరీర్ ఆరంభంలో కష్టాల్లో ఉన్నప్పుడు 'అతడు' సినిమాను పదేపదే చూసేవాడ్ని. ఆ సినిమాలో మహేష్‌బాబు పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం. ఆరంభం నుంచి ముగింపు వరకు ప్రతీ సీన్‌ను గుర్తుపెట్టుకున్నా. దర్శకుడు త్రివిక్రమ్ ఎమోషన్స్‌ను గొప్పగా తెరపైకి తీసుకొచ్చాడు. ఆ సినిమాలో కామెడీతో పాటు పాటలు కూడా బాగా ఇష్టం' అని విజయ్‌సేతుపతి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆయన 'విడుదల -2'తో పాటు తమిళంలో మరో చిత్రంలో నటిస్తున్నారు.

సమవుజ్జీల సమరం

అగ్ర హీరో సూర్య నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'కంగువ'. శివ దర్శకుడు. స్టూడియోగ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఓ రహస్య దీవిలో రెండు గిరిజన తెగల మధ్య జరిగిన పోరాటం ఇతివృత్తంగా ఈ సినిమాను తెరకెక్కించారని ట్రైలర్ ద్వారా అర్థమవుతున్నది. యుద్ధపిపాసిగా ప్రతినాయకుడు బాబీ డియోల్ కనిపించగా, తనవారిని రక్షించుకోవడానికి తానే ఒక సైన్యంగా మారే యుద్ధవీరుడు కంగువ పాత్రలో సూర్య కనిపించారు. భారీ ఓడలపై జరిగే యుద్ధ ఘట్టాలు, విజువల్స్ హాలీవుడ్ సినిమాల స్థాయిలో ఉన్నాయి. బాబీ డియోల్, సూర్య పాత్రలు సమవుజ్జీల సమరాన్ని తలపించాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వెట్రి పళనిస్వామి, నిర్మాతలు: కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్, రచన-దర్శకత్వం: శివ.

వీకే నరేష్ గోల్డెన్‌జూబ్లీ సెలబ్రేషన్స్

సీనియర్ నటుడు వీకే నరేష్ ఈ ఏడాదితో 50 సంవత్సరాల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో బాలీవుడ్ హీరో జాకీ ష్రాఫ్, పూనమ్ ధిల్లాన్, జయసుధ, సుహాసిని, ఖుష్బూ, సాయిదుర్గాతేజ్, మనోజ్ మంచు, నారా రోహిత్, దర్శకుడు మారుతి, అనుదీప్, అలీతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకృష్ణ మందిర్, ఘట్టమనేని ఇందిరాదేవి స్ఫూర్తివనాన్ని వీకే నరేష్ ప్రారంభించారు. భావితరం ఫిల్మ్‌మేకర్స్‌కు ఇది తన కానుకని వీకే నరేష్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ స్ఫూర్తివనంలో భవిష్యత్తులో ఫిల్మ్ లైబ్రరీ, మ్యూజియంను ఏర్పాటు చేయబోతున్నారు.

'ధూం ధాం'గా టీజర్

చేతన్‌కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ధూం ధాం'. సాయికిషోర్ మచ్చా దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి గోపీమోహన్ స్టోరీ, స్క్రీన్‌ప్లే అందించారు. రామ్‌కుమార్ నిర్మాత. సెప్టెంబర్ 13న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ఈ చిత్ర టీజర్‌ను హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీనువైట్ల విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనువైట్ల మాట్లాడుతూ.. సినిమా ట్రైలర్ బాగుందని, తన దగ్గర ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన గోపీమోహన్ కథ, స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రధానబలంగా నిలిచిందని అన్నారు. నిర్మాత రామ్‌కుమార్ సినిమా అంటే మంచి పాషన్ కలిగిన ప్రొడ్యూసర్ అని, గోపీమోహన్ మంచి కథనిచ్చారని హీరో గోపీచంద్ తెలిపారు. చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించామని, గోపీమోహన్ కథ ఆకట్టుకుంటుందని నిర్మాత ఎం.ఎస్.రామ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, దర్శకత్వం:! సాయికిషోర్ మచ్చా.

ప్రేమోత్సవం

దిలీప్‌ప్రకాష్, రెజీనా కసాండ్రా జంటగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఉత్సవం'. అర్జున్‌సాయి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సురేష్ పాటిల్ నిర్మాత. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 13న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయబోతున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమ, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో సాగే బ్యూటీఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో పాటు చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుంది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. ప్రకాష్ రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్, రచన-దర్శకత్వం: అర్జున్‌సాయి.

రాష్ట్రపతి నుంచి ఆహ్వానం

ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి, తెలుగు నటి సంధ్యారాజుకు అరుదైన గౌరవం దక్కింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే 'ఎట్ హోమ్' వేడుకలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి సంధ్యారాజుకు ఆహ్వానం అందింది. తొలిచిత్రం 'నాట్యం'తో రెండు జాతీయ అవార్డులను దక్కించుకుంది సంధ్యారాజు. హైదరాబాద్‌లో నిశృంఖల డ్యాన్స్ అకాడమీని స్థాపించి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక నృత్య కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు సినీరంగంలో నటిగా రాణిస్తున్నారు. 'ఎట్ హోమ్' కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని సంధ్యారాజు ఆనందం వ్యక్తం చేసింది.

పట్నం పిల్ల ప్రేమలో..

తేజస్ కంచర్ల హీరోగా గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఉరుకు పటేల'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా నుంచి 'పట్నం పిల్ల' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. పట్నం నుంచి సెలవులకు పల్లెటూరికి వచ్చిన కథానాయికపై హీరో మనసు పారేసుకుంటాడు. అతని మనసులోని భావాలను వ్యక్తం చేసే పాట ఇదని, గ్రామీణ అందాల నేపథ్యంలో ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ పాటను కాసర్ల శ్యామ్ రచించగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్నందించారు.